


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA · RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 27.07.2026 | సంపుటి : 3 | సంచిక: 175 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 27.07.2026 | VOLUME : 3 | ISSUE : 175 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





# ధర్మేంద్ర రాజీనామా బీజేపీ వ్యూహమేనా?

- పార్లమెంట్ అజెండా, ఎన్నికల సమీకరణలతో ముడిపడిన రాజకీయ నిర్ణయం!
- వర్షాకాల సమావేశాల ముందు వివాదానికి తెరదించే ప్రయత్నమా?
- డీలిమిటేషన్, ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లులపై దృష్టి కేంద్రీకరించిన కేంద్రం
- ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న రాజకీయ లెక్కలు
- పంజాబ్‌లో ఆప్, కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే వ్యూహమనే చర్చ

**న్యూఢిల్లీ, జూలై 26 :**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన యువత, పలు విద్యార్థి సంఘాలు తమ ఆందోళనను విరమించుకున్నప్పటికీ, ఈ రాజీనామా వెనుక కేవలం వివాదానికి ముగింపు పలకాలనే ఉద్దేశం కాకుండా విస్తృత రాజకీయ వ్యూహం కూడా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వ కీలక శాసన కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పార్లమెంట్ అజెండాపై దృష్టి**

కేంద్ర ప్రభుత్వం వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, విదేశీ విరాళాల నియంత్రణకు సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు

మిగతా 2వ పేజీలో..

# పేపర్ లీక్‌లపై సీజేపీ ద్వంద్వ వైఖరి ?

- పంజాబ్, కర్ణాటక వ్యవహారాల్లోనూ ఒకే వైఖరి అవలంబించాలని డిమాండ్
- నీట్ వివాదం తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- పంజాబ్, కర్ణాటక పేపర్ లీక్‌లపై కాక్రోచ్ మౌనమంటూ విమర్శలు
- ఆయా రాష్ట్రాల విద్యాశాఖ మంత్రుల రాజీనామా డిమాండ్
- సెలెక్టివ్ రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీజేపీ నేతల వీడియోలు

**న్యూఢిల్లీ, జూలై 26 :**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయగా, ఆ శాఖ బాధ్యతలను ప్రహ్లాద్ జోషి స్వీకరించారు. ఈ పరిణామం తర్వాత ఇప్పుడు పంజాబ్, కర్ణాటకలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న పేపర్ లీక్ ఘటనలపైనా అదే స్థాయిలో స్పందించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)పై ఒత్తిడి పెరుగుతోంది. ఆయా

మిగతా 2వ పేజీలో..



# చట్టసభల్లో యువతకు పెద్దపీట

- ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల కనీస వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలి: కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన
- ఆగస్టు తొలి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో తీర్మానం
- జెన్-జీ తరానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్న సీఎం
- తెలంగాణ అభివృద్ధికి గుజరాత్ తరహా సహకారం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 26 :**

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ జనాభాలో గణనీయమైన శాతం ఉన్న యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించే సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2వ పేజీలో..





## శ్రీరాంసాగర్‌లో విషాదం ఈతకు వెళ్లి నలుగురు యువకుల మృతి

- ముప్కాల్ సమీపంలోని ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ఘటన
- ఐదుగురిలో ఒకరు సురక్షితంగా బయటపడిన యువకుడు
- మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా గుర్తింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**నిజామాబాద్, జూలై 26 :**

నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) బ్యాక్‌వాటర్‌లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. ఈతకు వెళ్లిన ఐదుగురు యువకుల్లో నలుగురు నీట మునిగి మృతి చెందగా, ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు.
ముప్కాల్ సమీపంలోని బ్యాక్‌వాటర్‌లో

మిగతా 2వ పేజీలో..

# ప్రజా భవన్‌లో ఘనంగా బోనాల వేడుకలు


- నల్లపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రార్థనలు
- తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నాయకులు

**హైదరాబాద్, జూలై 26 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజా భవన్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులతో కలిసి నల్లపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధల

మిగతా 3వ పేజీలో..





## హైదరాబాద్‌లో పావురాల బెడద..

- సేఫ్టీ నెట్లకు భారీ డిమాండ్
- పావురాల సమస్యతో అపార్ట్‌మెంట్లు, కార్యాలయాల్లో అప్రమత్తత
- బాల్కనీలు, కిటికీలకు సేఫ్టీ నెట్లు, బర్డ్ స్పైక్‌ల ఏర్పాటు
- గత ఏడాదితో పోలిస్తే 40–50 శాతం పెరిగిన విక్రయాలు
- పావురాల రెట్టలతో ఆరోగ్య సమస్యలపై వైద్యుల హెచ్చరిక
- పావురాల నియంత్రణపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశం

2

## ఆదిలాబాద్‌కు జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్

- రూ.2,278 కోట్లతో భారీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
- 2,009 ఎకరాల్లో ఆధునిక విమానయాన కేంద్రం ఏర్పాటు
- కార్గో, ఎంఆర్ఓ సదుపాయాలతో పారిశ్రామిక రంగానికి ఊతం
- 2026 డిసెంబర్ 31 నాటికి భూసేకరణ, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని ఆదేశం

2





## కొమురవెల్లి మల్లన్నకు రైలు సౌకర్యం ప్రారంభం

- కొత్త రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం
- సికింద్రాబాద్ నుంచి రూ.25కే మల్లన్న సన్నిధికి ప్రయాణం

2

## బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి అస్వస్థత

- గుండెపోటుతో ఆసుపత్రిలో చేరిన మాజీ ఎమ్మెల్యే
- వరంగల్‌లోని రోహిణీ ఆసుపత్రిలో చికిత్స
- ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు
- పరామర్శకు వెళ్లిన కేటీఆర్, హరీశ్ రావు

3





## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి

3

రాజముద్ర

# ఆదిలాబాద్‌కు జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్

**హైదరాబాద్, జూలై 26 :**

ఉత్తర తెలంగాణ సమగ్ర అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఆదిలాబాద్‌లో రూ.2,278.14 కోట్ల అంచనా వ్యయంతో 'ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్' ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

మొత్తం 2,009.23 ఎకరాల విస్తీర్ణంలో ఈ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్‌డ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో సాధారణ విమానయాన సేవలతో పాటు కార్గో రవాణా, విమానాల నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవల కోసం ఎంఆర్‌ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. రక్షణ, పౌర విమానయాన అవసరాలను ఒకే వేదికపై తీర్చేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ ఎయిర్‌ఫీల్డ్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు కొత్త ఊపు లభిస్తుందని మంత్రి అన్నారు. కార్గో సదుపాయాల వల్ల పారిశ్రామిక ఉత్పత్తుల రవాణా వేగవంతం కావడంతో పాటు పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రక్షణ, పౌర విమానయాన రంగాల కార్యకలాపాలతో స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల మార్పిడి పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరుతోందని, రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# పేపర్ లీక్‌లపై సీజేపీ ద్వంద్వ వైఖరి ?

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాల్లోని విద్యాశాఖ మంత్రుల రాజీనామాలను కూడా డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టాలని యువతతో పాటు రాజకీయ వర్గాలు కోరుతున్నాయి.

**పంజాబ్‌లో రాజీనామా డిమాండ్**

పంజాబ్‌లో ఇటీవల ప్రభుత్వ నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ముఖ్యంగా ఫార్మసీ ఆఫీసర్ల నియామక పరీక్షలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్, బీజేపీ ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామా చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. కేంద్రంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే, పంజాబ్‌లో కూడా బాధ్యులు నైతిక బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

**కర్ణాటకలోనూ అదే ప్రశ్న**

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కూడా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలపై ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలు రావడంతో రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర మంత్రి మధు బంగారప్ప రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. కేంద్రంలో నైతిక బాధ్యతను ప్రస్తావించిన కాంగ్రెస్, తన ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో అదే ప్రమాణాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తోంది.

**సీజేపీపై విమర్శలు**

పంజాబ్, కర్ణాటక వ్యవహారాలపై సీజేపీ నాయకత్వం స్పష్టమైన స్పందన ఇవ్వకపోవడం రాజకీయ చర్చకు దారితీసింది. నీట్ అంశంపై తీవ్రస్థాయిలో ఆందోళనలు చేసిన పార్టీ, ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లోని ఆరోపణలపై మౌనం పాటిస్తోందని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. ఒకే అంశంపై రాష్ట్రాన్ని బట్టి వేర్వేరు వైఖరులు అవలంబిస్తున్నారని ఆరోపిస్తున్నాయి.

**వైరల్ అవుతున్న వీడియోలు**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలను విద్యార్థులు ప్రశ్నించిన వీడియోలు, అలాగే పంజాబ్ పేపర్ లీక్ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయారంటూ ప్రచారంలో ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. నీట్ వివాదంలో గట్టిగా మాట్లాడిన నేతలు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు నెటిజన్ల నుంచి వినిపిస్తున్నాయి




# ఫీజు బకాయిలపై బీజేపీ అల్టిమేటం

- వారం రోజుల్లో విడుదల చేయాలి.. లేకుంటే సీఎం రాజీనామా చేయాలి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు
- రూ.12,000 కోట్ల బకాయిలతో 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్న ఆరోపణ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రస్తావించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు

**హైదరాబాద్, జూలై 26 :**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు తీవ్రరూపం దాల్చాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వారం రోజుల్లోగా విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆరోపించారు. విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.

నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని ప్రస్తావించిన రాంచందర్ రావు, "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం.. ఇప్పుడు మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలను ఖండిస్తూ ర్యాలీలు నిర్వహించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యల విషయంలో మాత్రం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. ఫీజు బకాయిల సమస్యను వెంటనే పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

# కొమురవెల్లి మల్లన్నకు రైలు సౌకర్యం ప్రారంభం

- కొత్త రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం
- సికింద్రాబాద్ నుంచి రూ.25కే మల్లన్న సన్నిధికి ప్రయాణం
- స్టేషన్ నుంచి ఆలయానికి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచన
- రూ.40 కోట్లతో డబుల్ లైన్, అదనపు ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధికి హామీ
- తెలంగాణలో రూ.48 వేల కోట్ల రైల్వే పనులు జరుగుతున్నాయని వెల్లడి



**కొమురవెల్లి, జూలై 26 :**

ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న భక్తులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్తగా నిర్మించిన కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు రఘునందన్ రావు, డాక్టర్ కె. లక్ష్మణ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు చవకగా ప్రయాణం**

ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. కేవలం రూ.25 స్వల్ప చార్జీతోనే సికింద్రాబాద్ నుంచి నేరుగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి భక్తులు చేరుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ నుంచి ఆలయానికి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**స్టేషన్ విస్తరణకు రూ.40 కోట్లు**

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రూ.40 కోట్ల అంచనాతో డబుల్ లైన్ ట్రాక్, అదనపు ప్లాట్‌ఫారమ్‌లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

**తెలంగాణలో వేగంగా రైల్వే అభివృద్ధి**

హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించేందుకు అవసరమైన భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి రెండు సార్లు లేఖ రాశానని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సహకారంతో ఈ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో రూ.48 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో గత 12 ఏళ్లలో రైల్వే రంగానికి నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 43 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తుండగా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

**వందే భారత్, కోచ్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యం**

తెలంగాణకు ఇప్పటికే ఐదు వందే భారత్ రైళ్లను కేటాయించడంతో పాటు మూడు బుల్లెట్ రైలు ప్రాజెక్టులను కూడా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే ఇంజిన్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాదిలో వాటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులను వేగవంతం చేసేందుకు కూడా కేంద్రం సహకరిస్తుందని తెలిపారు.

**అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం**

ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు స్పష్టం చేశారని కిషన్ రెడ్డి అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించి పేదరికం లేని దేశాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో పావురాల బెడద..

**హైదరాబాద్, జూలై 26 :**



హైదరాబాద్‌లో పావురాల సంఖ్య అసాధారణంగా పెరుగుతుండటంతో నగరవాసులు అప్రమత్తమవుతున్నారు. పావురాల నుంచి ఇళ్లను, కార్యాలయాలను రక్షించుకునేందుకు బాల్కనీలు, కిటికీలు, టెర్రస్‌ల వద్ద సేఫ్టీ నెట్లు, బర్డ్ స్పైక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో ఈ ఉత్పత్తులకు ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది.

**40–50 శాతం పెరిగిన విక్రయాలు**

గత ఏడాదితో పోలిస్తే ఈసారి సేఫ్టీ నెట్ల విక్రయాలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. అపార్ట్‌మెంట్లతో పాటు కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, రెస్టారెంట్ల యజమానులు కూడా వీటిని ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. విశాలమైన ప్రదేశాలకు హెచ్‌డీపీఈ నెట్లు, ఏసీ యూనిట్లు, కిటికీల అంచులకు బర్డ్ స్పైక్‌లను వినియోగదారులు అధికంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

**ఆరోగ్య ముప్పుపై హెచ్చరిక**

పావురాల రెట్టల వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండిన వ్యర్థాల నుంచి వ్యాపించే ఫంగస్ కారణంగా శ్వాసకోశ అలర్జీలు, హైపర్‌సెన్సిటివిటీ న్యూమోనైటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**భవనాలకూ నష్టం**

పావురాల వ్యర్థాల్లో ఉండే ఆమ్ల గుణాల వల్ల భవనాల పెయింట్, లోహపు భాగాలు దెబ్బతింటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే పక్షులు గూళ్లు కట్టడం వల్ల డ్రైనేజీ పైపులు మూసుకుపోయే సమస్యలు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు.

**హైకోర్టు దృష్టికి సమస్య**

పావురాల సమస్య తెలంగాణ హైకోర్టు దృష్టికి కూడా చేరింది. బహిరంగ ప్రదేశాల్లో పావురాలకు మేత వేయడాన్ని నియంత్రించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు, పావురాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మూడు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీని ఆదేశించింది.

**డిమాండ్ మరింత పెరిగే అవకాశం**

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పావురాల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో సేఫ్టీ నెట్లు, బర్డ్ స్పైక్‌లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు భావిస్తున్నారు.

## శ్రీరాంసాగర్‌లో విషాదం ఈతకు వెళ్లి నలుగురు యువకుల మృతి

మొదటిపేజీ తరువాయి

ఆదివారం సాయంత్రం ఐదుగురు యువకులు ఈతకు దిగారు. నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకుని స్థానికులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టి కొద్దిసేపటికే నలుగురు యువకుల మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. మృతుల పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# చట్టసభల్లో యువతకు పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

ఐఏఎన్‌ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, 21 ఏళ్లకే యువత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, మేయర్లుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఎందుకు కల్పించకూడదని ప్రశ్నించారు. దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న జెన్‌జీ తరానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కేలా చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు తొలి వారంలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయోపరిమితిని 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేస్తూ, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని తగ్గించే సమయం వచ్చిందన్నారు.

తెలంగాణ అభివృద్ధిపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా ఆమోదం తెలపాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని అన్ని రాష్ట్రాలను సమాన దృష్టితో చూడాలని, గుజరాత్‌కు అందించిన తరహా సహకారాన్ని తెలంగాణకు కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ 10 శాతం వాటా అందించే రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ప్రస్తుతం దేశంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయోపరిమితి 25



సంవత్సరాలు కాగా, రాజ్యసభ, శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయోపరిమితి 30 సంవత్సరాలుగా అమల్లో ఉంది.

# ధర్మేంద్ర రాజీనామా బీజేపీ వ్యూహమేనా?

మొదటిపేజీ తరువాయి

వంటి కీలక బిల్లులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో నీట్ వివాదం కారణంగా ప్రతిపక్షాలకు అదనపు అవకాశాలు ఇవ్వకుండా వివాదాన్ని ముందుగానే ముగించాలనే ఉద్దేశంతో కేంద్రం నిర్ణయం తీసుకుని ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**మారిన రాజకీయ సమీకరణాలు**

ఇటీవలి రాజకీయ పరిణామాలతో పార్లమెంట్‌లో సంఖ్యాబలం మారిందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతీయ పార్టీల ఎంపీల మద్దతు లభించే అవకాశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన కీలక బిల్లులను ఆమోదింపజేసుకునే ప్రయత్నాల్లో ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అనవసర రాజకీయ ఉద్రిక్తతలను నివారించడానికే రాజీనామా నిర్ణయం తీసుకున్నారనే విశ్లేషణ వినిపిస్తోంది.

**ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రభావం**

మరో ఐదు నుంచి ఆరు నెలల్లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి రాజకీయ పరిస్థితులను కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకున్నట్లు భావిస్తున్నారు. నిరసనలు మరింత ఉధృతమై శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే అది ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని బీజేపీ అంచనా వేసి ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దేశ రాజకీయాల్లో కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో విజయాన్ని దృష్టిలో పెట్టుకుని వివాదాన్ని త్వరగా ముగించే ప్రయత్నం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**పంజాబ్, కర్ణాటకపై రాజకీయ దృష్టి**

పంజాబ్‌లో పేపర్ లీక్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ ప్రభుత్వం, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పుడు బీజేపీ మరింత దూకుడుగా విమర్శలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్రంలో మంత్రి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేసే అవకాశముందని విశ్లేషిస్తున్నారు. దీంతో రాబోయే ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలను రక్షణాత్మక స్థితిలోకి నెట్టే ప్రయత్నం జరిగే అవకాశముందని అంటున్నారు.

**రాజకీయ సందేశమే లక్ష్యమా?**

కేంద్ర మంత్రి రాజీనామా ద్వారా ప్రజాభిప్రాయాన్ని గౌరవించే ప్రభుత్వంగా తమను ప్రజల్లో ప్రదర్శించుకోవడంతో పాటు, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వాలనే ఉద్దేశం కూడా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో ఈ నిర్ణయాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని రాబోయే ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనే లెక్కలు కూడా బీజేపీ వేసి ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి





# ప్రజా భవన్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**మొదటిపేజీ తరువాయి**

నడుమ జరిగిన ఈ వేడుకల్లో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించారు. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావి తరాలకు అందించడంలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో బోనాల ఉత్సవాలు మరింత వైభవంగా కొనసాగుతున్నాయని నాయకులు అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ప్రార్థించారు.

పూజల అనంతరం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా భవన్‌కు విచ్చేసిన భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా జరిగిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తెలిపారు.



# జెన్-జీ యువతకు మంత్రి పదవులు ఇవ్వాలి

- **సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సవాల్**
- **ఖాళీగా ఉన్న కీలక శాఖలను యువతకు అప్పగించాలని డిమాండ్**
- **ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి అవకాశం కల్పించాలని సూచన**
- **మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జూలై 26 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెన్ జీ యువతకు అవకాశాలు కల్పించాలనే అభిప్రాయాన్ని ఆచరణలో నిరూపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న హోంశాఖ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ వంటి కీలక మంత్రి పదవులను 21 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువతకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, అవసరమైతే ప్రస్తుతం ఉన్న కొందరు ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి ఆ స్థానాలను కూడా జెన్‌జీ యువతకు ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ దృష్టిలో జెన్‌జీ అంటే వయోవృద్ధ నాయకులేనా అంటూ ఎద్దేవా చేశారు. యూత్ కోటా పేరుతో పెద్దలకు పదవులు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటేనని బండి సంజయ్ విమర్శించారు. దీనికి భిన్నంగా భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ "దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, పర్సన్ లాస్ట్" అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ సిద్ధాంతంలో భాగంగానే కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యత ఇస్తున్నామని కేవలం మాటలు చెప్పడం కాకుండా, రాష్ట్ర పాలనలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బండి సంజయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇస్నాపూర్‌లో అదృశ్యమైన నలుగురు బాలికలు క్షేమం

- **సికింద్రాబాద్‌లో గుర్తించిన పటాన్‌చెరు పోలీసులు**
- **ఈనెల 23 నుంచి అదృశ్యమైన బీహార్‌కు చెందిన విద్యార్థినులు**
- **తల్లిదండ్రులకు అప్పగించనున్న పోలీసులు**
- **ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు**

**సంగారెడ్డి, జూలై 27, :**

సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో ఇటీవల అదృశ్యమైన బీహార్‌కు చెందిన నలుగురు బాలికల మిస్సింగ్ కేసును పటాన్‌చెరు పోలీసులు ఛేదించారు. ఈనెల 23న ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి వెళ్లిన బాలికలు తిరిగి రాకపోవడంతో నమోదైన కేసులో, వారిని సికింద్రాబాద్‌లో సురక్షితంగా గుర్తించారు.

అదృశ్యమైన విద్యార్థినులు కుష్బూ కుమారి (16), మహిమా కుమారి (12), రోజా కుమారి (12), ప్రియా కుమారి (12)గా పోలీసులు గుర్తించారు. వీరంతా ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారని తెలిపారు. విద్యార్థినులు సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. అయితే ఆ రోజు బాలికలు పాఠశాలకు రాలేదని సిబ్బంది చెప్పడంతో వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి సికింద్రాబాద్‌లో బాలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం నలుగురు బాలికలు క్షేమంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. రెండు రోజులుగా తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు, స్థానికులు బాలికలు సురక్షితంగా లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు.





# కార్గిల్ వీరులకు నివాళి

- **సికింద్రాబాద్ వీరుల సైనిక స్మారక స్థూపం వద్ద శ్రద్ధాంజలి**
- **కార్గిల్ విజయ్ దివస్ భారత సైన్యం పరాక్రమానికి ప్రతీక: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు**
- **అమరవీరుల త్యాగం యువతకు స్ఫూర్తి కావాలని పిలుపు**
- **దేశ రక్షణలో సైనికుల సేవలు మరువలేనివని వ్యాఖ్య**

**హైదరాబాద్, జూలై 26 :**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వీరుల సైనిక స్మారక స్థూపం వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ భారత సైన్యం అజేయ ధైర్యానికి, అసమాన పరాక్రమానికి, అచంచల సంకల్పానికి ప్రతీక అని రామచందర్ రావు అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కార్గిల్ పర్వత శిఖరాలపై భారత సైనికులు అపూర్వ శౌర్యాన్ని ప్రదర్శించి దేశ గౌరవాన్ని కాపాడారని, వారి వీరోచిత పోరాటం భారత చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిందని చెప్పారు. కార్గిల్ యుద్ధంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ దేశ సమగ్రతను పరిరక్షించిన సైనికుల ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. శత్రు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన వారి సేవలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు. అమర జవాన్ల కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని తెలిపారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న భారత సైనికుల సేవలను కొనియాడిన రామచందర్ రావు, దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు వారు చేస్తున్న త్యాగం అపూర్వమని అన్నారు. ప్రతి భారతీయుడు సైన్యంపై గౌరవం, కృతజ్ఞత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగం యువతకు స్ఫూర్తిగా నిలుస్తూనే ఉంటుందని పేర్కొన్న ఆయన, దేశభక్తి, జాతీయ సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను యువత అలవర్చుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్గిల్ యోధుల వీరగాథలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాతృభూమి కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్లకు మరోసారి వినమ్ర నివాళులు అర్పిస్తున్నట్లు రామచందర్ రావు తెలిపారు. దేశ భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న భారత సైనికులందరికీ శిరసు వంచి వందనం చేస్తున్నామని, వారి త్యాగాలు భారతదేశానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి అస్వస్థత

**వరంగల్, జూలై 27, :**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గుండెపోటు రావడంతో వెంటనే వరంగల్‌లోని రోహిణీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

హనుమకొండలోని తన నివాసంలో ఉన్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుండగా, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

సుదర్శన్ రెడ్డి అస్వస్థత విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు వరంగల్‌లోని రోహిణీ ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి 2004లో వరంగల్ జిల్లా టీఆర్ఎస్ కన్వీనర్‌గా, అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. 2014లో నర్సంపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలైన ఆయన, 2018 శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు.

# నీట్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసు

- **ప్రధాన నిందితుడు ఎన్‌కౌంటర్‌లో గాయాలతో అరెస్ట్**
- **చిత్రకూట్ అడవుల్లో పోలీసుల జాయింట్ ఆపరేషన్**
- **పోలీసులపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు**
- **నిందితుడి కాలికి బుల్లెట్ గాయం.. కానిస్టేబుల్‌కు కూడా గాయాలు**
- **నిందితుడిపై రూ.50 వేల బహుమతి ప్రకటించిన పోలీసులు**
- **పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగింపు**

**లక్నో, జూలై 26 :**

ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాలో నీట్ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు జితేంద్ర అలియాస్ భోలాను పోలీసులు ఎదురుకాల్పుల అనంతరం అరెస్ట్ చేశారు. భారతికూప్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మడ్ఫా అడవుల్లో నిందితుడు దాక్కున్నాడనే సమాచారంతో పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.

**ఎదురుకాల్పుల్లో గాయాలు**

ఆపరేషన్ సందర్భంగా నిందితుడు పోలీసులపై కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడి కాలికి బుల్లెట్ గాయమై అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల్లో బహిల్‌పుర్వా పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాఘవేంద్ర కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిపై ఇప్పటికే రూ.50 వేల నగదు బహుమతి ప్రకటించారు.

**అటవీ అధికారులమంటూ దారుణానికి పాల్పడ్డారు**

జూలై 22న మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాకు చెందిన 20 ఏళ్ల నీట్ విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి దేవంగన ఎయిర్‌పోర్టు సమీపంలో వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు తమను అటవీ అధికారులమని చెప్పి అడ్డుకున్నారు. అనంతరం యువకుడిని చెట్టుకు కట్టేసి, ఇద్దరు నిందితులు విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

**సాంకేతిక ఆధారాలతో గుర్తింపు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు గాలింపు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాలు, ఎలక్ట్రానిక్ నిఘా, స్థానిక సమాచారంతో నిందితులను గుర్తించారు. బాధితురాలు ఫోటోల ద్వారా ప్రధాన నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

**ఇద్దరి కోసం గాలింపు**

ప్రధాన నిందితుడి వద్ద నుంచి రెండు అక్రమ .315 బోర్ పిస్టళ్లు, తూటాలు, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు గాలింపు కొనసాగుతోందని చిత్రకూట్ జిల్లా ఎస్పీ అరుణ్ కుమార్ సింగ్ తెలిపారు.

## పరీక్షల సంస్కరణలకు మోదీ సర్కార్ శ్రీకారం

- **నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**

**న్యూఢిల్లీ, జూలై 26 :**

దేశంలోని పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రకటించారు. పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు ఈ కమిటీ సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు.

**సాంకేతికతతో సంస్కరణలు**

సామాజిక మాధ్యమంలో విడుదల చేసిన వీడియో సందేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. పరీక్షల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించి, అవకతవకలకు తావులేని వ్యవస్థను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు చెప్పారు.

**అవకతవకలపై కఠిన చర్యలు**

పరీక్షలలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని ప్రధాని పేర్కొన్నారు. పరీక్షా అవకతవకలకు పాల్పడిన పలువురు ప్రస్తుతం జైలులో ఉన్నారని తెలిపారు. పార్లమెంట్‌లో కఠిన నిబంధనలతో కూడిన కొత్త చట్టాన్ని కూడా తీసుకురానున్నట్లు వెల్లడించారు.

**త్వరలో కమిటీ సిఫారసులు**

నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ పరీక్షా విధానంలో అవసరమైన మార్పులపై సమగ్ర అధ్యయనం చేసి వీలైనంత త్వరగా తన సిఫారసులను కేంద్రానికి అందజేస్తుందని ప్రధాని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో పరీక్షల విశ్వసనీయతను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి

- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం కీలక శాఖ పగ్గాలు**
- **కేంద్ర విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి**
- **ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన నూతన మంత్రి**
- **ఐదుసార్లు ఎంపీగా గెలిచిన సీనియర్ నాయకుడు**

**న్యూఢిల్లీ, జూలై 26 :**

కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా సీనియర్ బీజేపీ నాయకుడు ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో, ఆ శాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం ప్రహ్లాద్ జోషికి అప్పగించింది.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. వినయంతో, కర్తవ్యనిష్ఠతో ఈ బాధ్యతలను నిర్వహిస్తానని పేర్కొన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ బాధ్యతలను వెంటనే ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో విద్యాశాఖకు కొత్త నాయకత్వాన్ని తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది.

కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేసిన ఆయన, 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు. ఇప్పుడు కేంద్ర విద్యాశాఖ బాధ్యతలను కూడా చేపట్టారు.





# ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్.. ప్రజల ప్రాణాలకు ముప్పు..

- డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి..
- బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్..



**రామచంద్రపురం, జూలై 26 :**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు గ్రామంతో పాటు ఈదులనాగులపల్లి, ఉస్మా నగర్, తెల్లాపూర్, 2బీహెచ్‌కే కాలనీల్లో మూతలు లేని, పాడైపోయిన మ్యాన్‌హోల్స్ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలు, చిన్నారులు, వాహనదారులు ప్రమాద భయంతో రాకపోకలు సాగిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొన్నదని తెలిపారు.
డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్ కారణంగా పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి, మూతలు లేని మ్యాన్‌హోల్స్‌కు వెంటనే మూతలు ఏర్పాటు చేయడంతో పాటు దెబ్బతిన్న వాటిని శాశ్వతంగా మరమ్మతు చేయాలని కోరారు. ప్రజల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని సాయిచరణ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.



# పటాన్‌చెరును ఎస్ఐఆర్‌లో రాష్ట్రంలో నంబర్-1గా నిలపాలి..

- వివిధ రాష్ట్రాల ఓటర్లు, కార్మికులకు ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపు

**పటాన్‌చెరు, జూలై 26 :**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హుడైన ఓటరు పాల్గొని పటాన్‌చెరును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు, కార్మికులకు నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పటాన్‌చెరు మినీ ఇండియాగా పేరొందిందని, స్థానికంగా నివసిస్తూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రతి ఓటు నియోజకవర్గ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాయికోటి రాజును ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల ప్రజలు పాల్గొన్నారు.



# ఆషాఢ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రాపురం, జూలై 26 :**

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా భారతి నగర్ డివిజన్ ఫెన్సింగ్ ఏరియాలోని శ్రీ దుర్గామాత ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేష్, నరేష్, జాకీర్, అనిల్, తనాజీ, బీఆర్ఎస్ మైనారిటీ సీనియర్ నాయకులు ఘౌస్ భాయ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఉత్సవాలలో పాల్గొనాలి

- ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్రెడ్డి
- ఆషాఢ మాస ఉత్సవాలకు గుమ్మడిదలలో ఏర్పాట్లు
- దేవాలయ కమిటీ సమావేశంలో పండుగల తేదీల ఖరారు

**గుమ్మడిదల, జూలై 26( ):**



ఆషాఢ మాసం సందర్భంగా గ్రామదేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ అమ్మవార్ల పండుగల నిర్వహణపై గుమ్మడిదలలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతల పండుగలు గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో ఉత్సవాల్లో పాల్గొని పండుగలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, కౌన్సిలర్ నరేందర్‌రెడ్డి, కత్తుల రమేష్, దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చుక్కయ్య, కోశాధికారి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, సత్యనారాయణ, నర్సింలు, రాంరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పండుగల తేదీలు ఖరారు**

ఆగస్టు 2న పోచమ్మ పండుగ, ఆగస్టు 4న ఎల్లమ్మ పండుగ, ఆగస్టు 8న దుర్గమ్మ అమ్మవారికి బండ్ల బోనాల కార్యక్రమం, ఆగస్టు 9న లింగమయ్య బోనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సంప్రదాయాలను పాటిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

# సంకల్ప్ పార్కు అభివృద్ధికి జీఎంఆర్ హామీ..

- ఎల్ఐజీ స్వర్ణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రాపురం, జూలై 26 :**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ సంకల్ప్ పార్కును పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానికుల సూచనలు స్వీకరించిన ఆయన పార్కులో వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, చిన్నారుల ఆట పరికరాలు, బాల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేసి ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు.
అనంతరం బీహెచ్ఈఎల్ ఎల్ఐజీ హౌస్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ స్వర్ణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీకి విశేష సేవలందించిన మాజీ డైరెక్టర్లు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో రోడ్లు, పార్కులు, బస్తీ దవాఖానా, వార్డు కార్యాలయం, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, అండర్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎల్ఐజీ కాలనీ ప్రజలు ఎప్పటికీ బీఆర్ఎస్‌కు అండగా నిలిచారని, వారి మధ్యకు రావడం ఆనందంగా ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో ఐలేష్, రమణ, వెంకట్ రెడ్డి, యాదగిరి రెడ్డి, సొసైటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీ, యూ ఆర్ ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు

**శివంపేట్ జులై 26:**

టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కేజీబీవీ శివంపేట్ లో ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీబీవీ, యు ఆర్ ఎస్, ఎస్ ఎస్ ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.. మహిళలు అయినప్పటికీ శక్తికి మించి పనిచేస్తున్న కనీస వేతనానికి నోచుకోవడం లేదని వాపోయారు.. కావున ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని కోరారు..అలాగే హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని,సమ్మె కాలపు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు యు.గంగాధర్, కేజీబీవీ ఉపాధ్యాయినిలు మంజుల, జ్యోతి, స్వప్న, కోమల,రాధిక, జ్వాల, జి స్వప్న, వేరొనిక, రాణి,సంతోషి పాల్గొన్నారు...





# చదివిన హాస్టల్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ జిఎం అంజయ్య

**నల్గొండ జులై26 :**

హాస్టల్లో సమస్యలు తీరుస్తా, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తానని టీజీఎస్పీడీసీఎల్ లో జనరల్ మేనేజర్‌గా అంజయ్య అన్నారు. నల్గొండ జిల్లా రామన్నపేట లో ఆదివారం తాను 1989-1991 మధ్యకాలంలో విద్యనభ్యసించిన హాస్టల్‌ను ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, విద్యా పరిస్థితులు మరియు హాస్టల్‌లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ వీరబాబు గారిని సంప్రదించగా, హాస్టల్‌లో ఫ్యాన్ల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన అంజయ్య గారు, విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్‌కు అవసరమైన ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “నేను కూడా ఇదే హాస్టల్‌లో చదివి నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. మీరు కూడా కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించి, మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు మరియు సమాజానికి మంచి పేరు తీసుకురావాలి” అని ప్రోత్సహించారు. అదేవిధంగా, పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించే ప్రతి విద్యార్థికి రూ.10,000 చొప్పున నగదు ప్రోత్సాహ[illegible] దజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా [illegible] వీరబాబు సేవలను అంజయ్య ప్రత్యేకంగా కొనియాడారు. హాస్టల్‌లోనే నివసిస్తూ ప్రతిరోజూ విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు, వారి అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థుల సంక్షేమం, క్రమశిక్షణ, విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ, పిల్లలను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారి యోగక్షేమాలను పర్యవేక్షిస్తున్న వార్డెన్ వీరబాబు గారి సేవలు అభినందనీయమని పేర్కొంటూ, ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం హాస్టల్ భవనాన్ని పరిశీలించిన అంజయ్య గారు, భవనం స్లాబ్ శిథిలావస్థలో ఉండటాన్ని గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, హాస్టల్ భవన మరమ్మతులు చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి బద్దం రజిత సుధీర్ , ఇంగ్లూరు గ్రామ సర్పంచ్ పాపకంటి సైదులు, హాస్టల్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, గ్రామ పెద్దలు మరియు పాల్గొన్నారు.

# సాహు మహారాజ్‌కు బీఎస్పీ నివాళి..

- సాహు మహారాజ్ ఆశయాలకు బీఎస్పీ నివాళి..
- 50% రిజర్వేషన్ల చరిత్రను గుర్తుచేసిన బీఎస్పీ..
- సామాజిక న్యాయ సాధనకు సాహు మార్గమే: రాజేంద్రప్రసాద్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 26**

రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకమని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రిజర్వేషన్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ సమావేశ ప్రాంగణంలో ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల [illegible]క్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కొల్హాపూర్ సంస్థా[illegible] బహుజన వర్గాలకు తొలిసారిగా అధికారికంగా 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని అన్నారు. రిజర్వేషన్ల దినోత్సవాన్ని నిర్వహించడం అంటే ఆయన ఆశయాలు, సామాజిక న్యాయ భావనను కొనసాగించడమేనని పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ బాధ్యుడు గోలేటి నారాయణ, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్, మందమరి మండల అధ్యక్షుడు ఎం.డి. రహీం బాబా పాల్గొన్నారు.





# దేవేందర్ నగర్ కాలనీలో రౌడీ మూకల ఆట కట్టించాలి

## దేవేందర్ నగర్ కాలనీవాసులకు అండగా రాజకీయ నాయకులు

- మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చిన అఖిలపక్షం సభ్యులు
- అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి,
- బిఆర్ఎస్,కాంగ్రెస్,సిపిఐ, జనసేన నాయకులు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా జరుగుతున్న దాడులు,గొడవలు నేపథ్యంలో కాలనీలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని లక్ష్యంతో గత నెలలో గృహప్రవేశం జరుగుతున్న ఇంటి సభ్యుల పైన,అలాగే స్థానిక రిపోర్టర్ విష్ణు గౌడ్ ఇంటిపై రౌడీ గ్యాంగులు,గాంజా మూకలు రాళ్ల దాడి,కారు బైకుల ధ్వంసం ఘటనలో నిందితులపై బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ దాడికి ప్రధాన కారకులైన వ్యక్తులను కాకుండా ఇతర వ్యక్తులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని, తక్షణమే గొడవకు కారణమైన జెన్నరాజు, జెన్ననాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ అతని అనుచరులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేవేందర్ నగర్ కాలనీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో బిజెపి, బిఆర్ఎస్,కాంగ్రెస్, సిపిఐ, జనసేన, మొదలైన పార్టీ నాయకులు పాల్గొని బాధితులను,కాలనీవాసులను సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల శాంతిభద్రతలకు విగాదం కలిగించే ఎవరినైనా క్షమించరాదని,దేవేందర్ నగర్ కాలనీలో గొడవలకు ప్రధాన కారకుడుగా భావిస్తున్న జెన్నరాజు,జెన్ననాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ ,స్థానిక యువకులకు మత్తు పదార్థాలను అలవాటు చేసి ఆయన అవసరాల కోసం పలు గొడవలలో వారిని వాడుకుంటున్నారని, చాలామంది యువత మద్యం గంజాయి వంటి మతపదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పలువురు బాధితులు లబోదిబోమన్నారు. అనంతరం పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ దేవేందర్ నగర్ కాలనీ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ సంఘటనలో పోలీసుల వ్యవహారం కొంతమంది నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తపరుస్తున్నారు.ఈ సంఘటనలోని ప్రధాన నిందితులను అరెస్ట్ చేసే వరకు అఖిలపక్షం సభ్యులందరూ కాలనీవాసులకు అండగా ఉంటామని తెలుపుతూ సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు.ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు,మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్,బోడుప్పల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, జక్క రాములు,టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్, మేడ్చల్ జిల్లా బిజెపి నాయకులు జెనీగ వెంకటేష్, మేడిపల్లి మండల సిపిఐ పార్టీ అధ్యక్షులు రచ్చ కిషన్, జనసేన పార్టీ నాయకుడు సాయికుమార్,దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షుడు దయ్యాల మహేష్, జనరల్ సెక్రటరీ తాటికాయల యాదగిరి, అంబేద్కర్ నగర్ అధ్యక్ష దేశపాక నరసింహ, నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,గడ్డం యాదగిరి, దండు రమేష్, బాలస్వామి, పంగ రమేష్, భగవంతు, సదానంద్, కాలనీ కమిటీ సభ్యులు పండుగ యాకయ్య, అఫ్జల్,వెంకటేష్, మారపాక మధు, ఆరోగ్యం, మహిళలు నర్సమ్మ, పద్మ, జంగమ్మ, లావణ్య, శ్రీలత, రేణుక, అంజమ్మ, ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి నుండి వికారాబాద్ వెళ్లే రోడ్డును వెంటనే బాగుచెయ్యాలి

- నడి రోడ్డుపై ధర్నా చేసి, నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు
- రోడ్డు బాగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహన దారులు
- ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచించని ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రోజు శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి గూడ గేట్ వద్ద గుంతల రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసి, నిరసన తెలిపిన మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు. శంకర్ పల్లి నుండి వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయమైందని, సంవత్సరాలు గడుస్తున్న రోడ్డును బాగు గురించి ఆలోచించే అధికారులు, నాయకులు లేక వాహనదారులు తీవ్ర ..ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ,కాలే యాదయ్య ఈ రోడ్డును బాగు చేయడంలో విఫలమయ్యాడన్నారు. సొంత ప్రయోజనాలు తప్ప , ప్రజా శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే ఏనాడు ఆలోచించలేదని మండిపడ్డారు. మూడు జిల్లాలను కలిపే ఈ లింకు రోడ్డును ఏళ్లు గడుస్తున్నా బాగు చేయకపోవడం ఎమ్మెల్యే యాదయ్య పనితీరుకు నిదర్శనమని వారు ఎద్దేవా చేశారు. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలను అనుసంధానించే కీలక రహదారి దుస్థితిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డిగూడ గేట్ వద్ద భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. శంకర్ పల్లి నుంచి మైతాప్ఖాన్ గూడ క్రాస్‌రోడ్డు వరకు ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు అత్యంత అవసరమైన ప్రధాన రహదారుల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. శంకర్ పల్లి నుంచి మైతాప్ఖాన్ గూడ క్రాస్ రోడ్డు వరకు ఉన్న ఈ రహదారి నవాబ్‌పేట్–వికారాబాద్, ఎంకతల– మోమిన్‌పేట్–మర్పల్లి, గొల్లపల్లి–మల్కాపూర్–సంగారెడ్డి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గమని, ప్రతి రోజూ వేలాది మంది ఈ రహదారిపై ప్రయాణిస్తున్నారని తెలిపారు. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అంబులెన్స్‌లు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, వాహనాలు తరచూ చెడిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఈ రహదారి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ శంకర్ పల్లి మండల, మున్సిపల్ నాయకులు, లక్ష్మారెడ్డి గూడ, మహాలింగాపురం గ్రామాల ప్రజలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, మహాలింగాపురం సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జర్నలిస్టులు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండల కేంద్రంలో కట్ల కుంట సుధాకర్ తల్లి రామవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించడం వలన సుధాకర్ ను, వారి కుటుంబాన్ని ఆదివారం రోజున జర్నలిస్టులు ఎల్లన్న ఆధ్వర్యంలో పరామర్శించి, ప్రాగడ సానుభూతి తెలిపారు, రామవ్వ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు, ఈ కార్యక్రమంలో మారుతి, బైరు, గొల్లపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రెడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతారం గ్రామ కురుమ సంఘం

# నూతన కమిటీ ఎన్నిక



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

**అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పోస్టి కృష్ణ**

చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామంలో కురుమ సంఘం నూతన కమిటీని ఆ గ్రామ సమీపంలోని ఓ మినీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. అధ్యక్షుడిగా పోస్టి కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడిగా గణపురం తరుణ్, ప్రధాన కార్యదర్శిగా దుంస మహేందర్, సహ కార్యదర్శిగా అల్లి అనిల్, కోశాధికారిగా పెద్దగొల్ల వెంకటేశ్, సలహాదారులుగా పోస్టి మాణిక్యం, అల్లి సత్యనారాయణ, వీరాస్వామి, బండ సత్యనారాయణ, నరేందర్, లక్ష్మినారాయణ, అల్లి శ్రీశైలం, సంఘం సభ్యులుగా ఘనపురం ఆంజనేయులు, తంగడపల్లి కుమార్, రవికిశోర్, దయాకర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పోస్టి కృష్ణ, ఘనపురం తరుణ్ మాట్లాడుతూ....కురుమలు చైతన్య వంతులై ఐక్యంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా కురుమ సంఘం అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. కురుమల హక్కుల సాధనకు, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కురుమలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆగస్టు 9న పర్వతాపూర్‌లో బోనాల పండుగ

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** పర్వతాపూర్ గ్రామంలో ఈ సం వత్సరం బోనాల పండుగను ఆగస్టు 9వ తేదీన వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలు, పలు కాలనీల అధ్యక్ష కార్యదర్శులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ఊరంతటికీ క్షేమం కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ముఖ్యుల సమావేశంలో పండుగ నిర్వహణ తేదీని ఖరారు చేసి, ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు కావాల్సిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ సాంప్రదాయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే ఈ బోనాల ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవతలైన మైసమ్మ, మహంకాళి, పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించనున్నారు. పోతురాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి.

శాంతియుత వాతావరణంలో, భక్తిప్రపత్తులతో ఈ పండుగను విజయవంతం చేయాలని, గ్రామ ప్రజలందరూ భాగస్వాములై అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని నిర్వహణ ప్రతినిధులు కోరారు.

## ఆగస్టు 15లోపు ప్రతి విద్యార్థికి

# యూనిఫాం అందాలి

- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, రాజముద్ర న్యూస్ :**

ఆగస్టు 15లోపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ద్వారా యూనిఫాంల స్టిచ్చింగ్ పనులను వేగవంతం చేసి, ఏ ఒక్క విద్యార్థి కూడా యూనిఫాం లేకుండా మిగలకుండా పకడ్బందీగా ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. యూనిఫాంల తయారీ, గ్రామాల్లో తాగునీటి సరఫరా, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, వివో భవనాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని, వివో భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# వర్షా భావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

**కరీంనగర్, రాజముద్ర న్యూస్ :**

**మండల రైతు వేదికల్లో మూడు రోజుల పాటు విత్తన మేళాలు : జిల్లా కలెక్టర్ పిలుపు**

ఎల్‌నినో (El Niño) ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకుని మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఉన్న రైతు వేదికలలో సోమవారం, మంగళవారం, బుధవారం మూడు రోజుల పాటు ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ మేళాల్లో రైతులకు వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటల



విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు ఆయా పంటల సాగు విధానం, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా చిరుధాన్యాలు, అపరాలు (పప్పుధాన్యాలు), నువ్వులు, ఆముదం, కూరగాయల పంటలు సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితోనే సాగు చేయడానికి అనుకూలంగా ఉండటంతో పాటు రైతులకు మంచి ఆదాయాన్ని అందించే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు తమ ప్రాంతంలోని రైతు వేదికలకు హాజరై నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకుని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందిస్తారని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు



# ఎండతో ఆరోగ్యానికి అండ

శరీర ఆరోగ్యానికి విటమిన్లు చాలా అవసరం. వాటిని పొందాలంటే రకరకాల ఆహారపదార్థాలు తినాలి. అయితే, విటమిన్ –డి మాత్రం ఆహారంలోనే కాదు.. ఉచితంగా కూడా లభిస్తుంది. ఉదయం పూట సూర్యరశ్మి నుంచి డి – విటమిన్ పొందొచ్చని అందరికీ తెలుసు. కానీ, ఉచితంగా వచ్చే ఆ విటమిన్ కూడా సరిగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు చాలామంది. ప్రస్తుత రోజుల్లో చూస్తే.. సూర్యుడి బారి నుంచి తప్పించుకోవాలనే చూస్తున్నారే తప్ప.. అందువల్ల జరిగే ప్రయోజనం గురించి ఆలోచన చేయట్లేదు. ఇలా నిర్లక్ష్యం చేస్తే.. డి – విటమిన్ లోపిస్తుంది. దానివల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ఈ అంశం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ఇది చదివేయండి.

విటమిన్– డి ఎముకల్ని దృఢంగా ఉంచుతుంది. కొన్ని క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. ఇన్ని లాభాలున్నా భారతీయులకు మాత్రం డి – విటమిన్ లోపం ఉంటోందని స్టడీలో తేలింది. ప్రతి నలుగురిలో ముగ్గురికి విటమిన్–డి లోపం ఉంటోంది. పోయినేడాది ఓ సర్వేలో దాదాపు 76 శాతం మంది విటమిన్–డి లోపంతో బాధపడుతున్నారని తేలింది. అందులో ముఖ్యంగా 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లేనట.

### డిప్రెషన్ డి కారణమా?

ఇటీవల జరిగిన ఓ అధ్యయనం ప్రకారం విటమిన్ – డి లోపం డిప్రెషన్ కు దారి తీస్తుందట. డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తుల రక్తంలో విటమిన్ – డి తక్కువగా కలిగి ఉంటారని పరిశోధనలో తేలింది. విటమిన్ – డి అందిన తర్వాత వారి మానసిక స్థితిలో మెరుగుపడిందని ఈ అధ్యయనం తెలిపింది. ఫంక్షనల్ న్యూట్రిషనిస్ట్ ముగ్ధ ప్రధాన్,సీఈఓ, స్థాపకుడు, ఐత్రైవ్ ప్రకారం, డిప్రెషన్ లో ఉన్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా డిప్రెషన్ కు అనేక కారణాలున్నప్పటికీ విటమిన్ డి లోపం వల్ల అది ధీర్ఘ కాలంలో తీవ్రమైన సమస్యగా మారే ప్రమాదం ఉంది. గర్భధారణ సమయంలో విటమిన్ డి స్థాయిలు తక్కువ ఉండడం.. ప్రసవానంతరం ఎదురయ్యే పరిస్థితులతో ముడిపడి ఉండవచ్చని స్టడీలు చెప్తున్నాయి. ఇది ప్రసవం తర్వాత కొన్ని వారాలు లేదా నెలల వరకు ఆ తల్లులను ప్రభావితం చేస్తుంది. విటమిన్ డి లోపం దీర్ఘకాలిక వెన్నుపాము గాయాలు, స్ట్రోక్, మల్టిపుల్ స్క్లెరోసిస్ కు దారి తీయవచ్చు. ఇది వివిధ మానసిక ఆరోగ్య పరిస్థితులపైనా ప్రభావం చూపుతుంది.

### కాసేపు ఎండలో...


**సూర్యరశ్మి నుంచి మన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్ 'డి' అందుతుంది. దానివల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే నాడీ, కండరాల ఆరోగ్యానికి అవసరం. అంతేకాదు.. రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కాబట్టి రోజూ ఉదయాన్నేసూర్యకాంతిలో కనీసం పదిహేను నిమిషాలైనా నిలబడమని నిపుణుల మరీ మరీ చెప్తున్నారు. ఆ విటమిన్ పొందడానికి ఏవేవో ప్రయత్నాలు చేయక్కర్లేదు. సరైన ఫుడ్, సన్‌లైట్ ద్వారా తెచ్చుకుంటే సరిపోతుంది. లేదా డాక్టర్ సలహా మేరకు సప్లిమెంట్స్ కూడా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, అంతదాకా ఎందుకులే అనుకుంటే.. పైన చెప్పినట్టు ఫాలో అయిపోవచ్చు.**





### ఈ సమస్యలన్నీ లోపం వల్లే..

ఒకవేళ ఈ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, కీళ్ల నొప్పులు, అలసట, ఆందోళన, ఒత్తిడి, జుట్టు రాలడం, దీర్ఘకాలిక జీర్ణ సంబంధిత సమస్యలు.. వంటివి వచ్చే అవకాశం ఉంది. అలాగే చిరాకుగా ఉంటుంది. శక్తిని కోల్పోయినట్లు అనిపిస్తుంది. వీటితో పాటు ఒళ్లు నొప్పులు, చర్మం పొడిబారడం, దురదగా అనిపించడం, జుట్టు రాలి పోయే సమస్యలు తలెత్తుతాయి. ఇమ్యూనిటీ తగ్గుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు,జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. నిద్రలేమికి ఇది కూడా ఒక కారణం. డి – విటమిన్ లోపం ఉన్న వారు పదే పదే అనారోగ్యం బారిన పడుతుంటారు. విటమిన్ డి స్థాయిలు మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు.. కొన్ని రకాల క్యాన్సర్‌లకు కూడా కారణమవుతుంది. దీర్ఘకాలిక వ్యాధులైన అధిక రక్తపోటు, గ్లూకోజ్ స్థాయిల నియంత్రణ, గుండె జబ్బులు, అతిసారం, మూత్రాశయ సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం కారణంగా సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.



### ఈ ఫుడ్ తీసుకోవాలి

- ఆవు పాలలో విటమిన్ 'డి' ఎక్కువగా ఉంటుంది. రోజుకు ఒక గ్లాసు ఆవు పాలు తాగడం వల్ల రోజుకి 20 శాతం ఈ విటమిన్ శరీరానికి అందుతుంది.
- పెరుగులో కూడా ప్రొటీన్లతో పాటు 'డి' విటమిన్ ఎక్కువగా ఉంటుంది. కాకపోతే బయటి నుంచి తెచ్చుకోకుండా ఇంట్లోనే పెరుగు తయారుచేసుకుని తీసుకోవడం బెటర్.
- పుట్టగొడుగులు ఎండలోనే పెరుగుతాయి. కాబట్టి వీటిలో విటమిన్ 'డి' స్థాయులు ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో పాటు బి1, బి2, బి5, కాపర్.. వంటి పోషకాలు కూడా పుట్టగొడుగుల్లో అధికంగా ఉంటాయి.
- కమలాఫలంలో విటమిన్ సి, డిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇమ్యూనిటీని పెంచుతాయి.
- విటమిన్ 'డి' అధికంగా లభించే పదార్థాల్లో ఓట్స్ కూడా ఒకటి.
- గుడ్డు పచ్చసొనలో విటమిన్ 'డి' తో పాటు ప్రొటీన్లు, కొవ్వులు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి రోజుకు ఒక పచ్చసొన కంటే ఎక్కువ తీసుకోకూడదట!
- చేపల్లోనూ విటమిన్ 'డి' స్థాయులు ఎక్కువే. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్లు, ఫాస్పరస్.. వంటి పోషకాలు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయి.

# మాన్‌సూన్ వెడ్డింగ్‌కి.. ఈ చీరలు బెటర్

వేడుకలకు సీజన్‌తో పనేముంది? ఎప్పుడైనా ఏదో ఒక వేడుక జరుగుతూనే ఉంటుంది. కానీ, వాటికి వెళ్లాలంటే మాత్రం ఎలాంటి బట్టలు వేసుకోవాలి? అనేది పెద్ద ప్రశ్న. ఎందుకంటే అన్నికాలాలకు ఒకేలాంటి బట్టలు వేసుకోవడం కష్టమైన పని. కాలానుగుణంగా ధరిస్తేనే కంఫర్ట్‌గా ఉంటుంది. మామూలుగా వేడుకలకు వెళ్లే వాళ్లు, ముఖ్యంగా పెండ్లిళ్లకు వెళ్లేవాళ్లు పట్టుచీరలకే ఓటేస్తారు. మరి వానాకాలంలో ఎలాంటి చీరలు కట్టుకుంటే బెటర్ అంటే.. పట్టుచీరలు కష్టం. కాస్త తడిచినా అసౌకర్యంగా ఉంటుంది. కాబట్టి సరైన దుస్తులు వేసుకుంటే ఆ సౌకర్యమే వేరు. అవేంటో తెలుసుకుందాం.





షిఫాన్... చాలా తేలికగా, కాస్త పలుచగా ఉండే ఫ్యాబ్రిక్. మెత్తగా, లైట్ వెయిట్‌తో ప్రత్యేకంగా, చూడటానికి హుందాగా ఉంటుంది. డ్రెస్సులు, స్కర్టులకు ఈ క్లాత్ చాలా బాగా సెట్ అవుతుంది. దాంట్లో చాలా రంగులు, ప్యాటర్న్స్ ఉంటాయి.

కాటన్... ఒక సాంప్రదాయ, క్లాసిక్ ఫ్యాబ్రిక్. ఇది కూడా చాలా తేలికగా, సౌకర్యంగా ఉంటుంది. డ్రెస్సులు, సూట్లకు కూడా బాగుంటుంది. కాటన్‌లో చాలా రకాల అల్లికలుంటాయి. వేడిని, తేమని తట్టుకుంటాయి.

లినెన్... ఇది కాటన్ లాగే తేమను బాగా పీల్చుకుంటుంది. ఇది స్టైలిష్ లుక్ ఇస్తుంది. చీర కట్టుకున్నా, డ్రెస్ అయినా బాగుంటుంది.ఇది చూడటానికి చాలా రిచ్ గా కనిపిస్తుంది. అలాగే సౌకర్యంగానూ ఉంటుంది. రేయాన్ ఫ్యాబ్రిక్ కూడా స్టైలిష్ గా ఉంటుంది.

# ఆహారాన్ని గొడుగుతో కప్పేద్దాం!



'ఫుడ్ కవర్'... మీల్స్, టీ, స్నాక్స్ ఏ ఫుడ్ అయినా తినగా మిగిలిపోతే.. దాన్ని అలానే వదిలేయలేం కదా. మూతతో, క్లాత్‌తో కవర్ చేస్తుంటాం. కానీ, ఒక్కోసారి అలా కవర్ చేయడం వల్ల గాలి ఆడక అవి పాడైపోతాయి. అలాగని కవర్ చేయకపోతే.. ఈగలు ముసురుతుంటాయి. ఆ ఆహారాన్ని తినలేం కదా! ఈ సమస్యకు చెక్ పెట్టేందుకే ఈ ఫుడ్ కవర్లు. చూడ్డానికి గొడుగులా ఉన్న ఈ ఫుడ్ కవర్.. వాడడం చాలా తేలిక. గొడుగును వాడినట్టే వాడితే సరి. డైనింగ్ టేబుల్ మీద, ఫ్లోర్ మీద ఎక్కడైనా దీన్నిపెట్టొచ్చు. ఒకవేళ మాసిపోయినా కూడా శుభ్రపరచడం ఈజీనే. పైగా మడిచే సౌకర్యం ఉంటుంది. కాబట్టి వెకేషన్లకు వెళ్లినా వెంట తీసుకెళ్లొచ్చు.

# మూడో టీ20 కూడా మనదే... జింబాబ్వేపై టీమిండియా క్లీన్ స్వీప్

- మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల తేడాతో భారత్ విజయం
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా
- అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ (81)
- బంతితో మయాంక్ యాదవ్ (3 వికెట్లు), యశ్ ఠాకూర్ (2 వికెట్లు) రాణింపు
- జింబాబ్వే తరపున రియాన్ బర్ల్ (54*) ఒంటరి పోరాటం




**స్పోర్ట్స్ డెస్క్ :**

జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 30 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరే (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.

## వైభవ్ విషయంలో టీమిండియా క్లియర్ స్ట్రాటజీ.. అతని కోసం జట్టు అనుసరిస్తున్న అసలు వ్యూహాన్ని బయటపెట్టిన ఇషాన్ కిషన్!

- వైభవ్ సూర్యవంశీ విషయంలో టీమిండియా ప్రత్యేక వ్యూహం
- ఆటపైనే దృష్టి పెట్టాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచన
- యంగ్ సెన్సేషన్‌ను పరధ్యానంలో పడకుండా కాపాడుతున్న సీనియర్లు
- మేం చేసిన తప్పులు పునరావృతం చేయొద్దని చెబుతున్నామన్న ఇషాన్ కిషన్
- వైభవ్ అరుదైన ప్రతిభావంతుడని, అతడిని కాపాడుకోవడం తమ బాధ్యతని వెల్లడి

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్‌లో సరికొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విషయంలో టీమిండియా యాజమాన్యం, సీనియర్ ఆటగాళ్లు పక్కా వ్యూహంతో ముందుకెళుతున్నారు. సోషల్ మీడియా, బయటి ప్రపంచం మాటలు లాంటి అనవసర విషయాల వైపు దృష్టి మళ్లకుండా, కేవలం ఆటపైనే ఏకాగ్రత పెట్టేలా అతడిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ఆసక్తికర విషయాన్ని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ స్వయంగా వెల్లడించాడు.

జింబాబ్వేతో జరిగిన రెండో టీ20 మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో ఇషాన్ కిషన్ మాట్లాడాడు. వైభవ్ కెరీర్‌కు సంబంధించి జట్టు ఎలాంటి సలహాలు ఇస్తుందని అడిగిన ప్రశ్నకు బదులిచ్చాడు. "వైభవ్ చాలా తెలివైన కుర్రాడు. మైదానంలో, బయట ఎలా ఉండాలో అతనికి తెలుసు. కానీ, అతను వచ్చిన నేపథ్యం దృష్ట్యా అనేక పరధ్యానాలకు లోనయ్యే అవకాశం ఉంది. స్నేహితుల సర్కిల్‌లోనూ ఇలాంటివి ఎదురవుతాయి. నేను కూడా అలాంటి నేపథ్యం నుంచే వచ్చాను కాబట్టి, భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు దేనిపై దృష్టి పెట్టాలో నాకు బాగా తెలుసు" అని ఇషాన్ వివరించాడు.

"నేను మాత్రమే కాదు. అభిషేక్ శర్మ, అక్షర్ భాయ్ సహా జట్టులోని చాలా మంది సీనియర్లు వైభవ్‌తో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉంటారు. సోషల్ మీడియాలో ఏం జరుగుతోంది, బయట జనం ఏమనుకుంటున్నారు అనే విషయాల గురించి ఆలోచించకుండా, కేవలం క్రికెట్‌పైనే దృష్టి పెట్టేలా చూసుకుంటాం. పరుగులు చేయనప్పుడు బాడీ లాంగ్వేజ్ పడిపోకుండా ప్రోత్సహిస్తాం" అని ఇషాన్ తెలిపాడు.

వైభవ్ అరుదైన ప్రతిభావంతుడని, అతని లాంటి ఆటగాడు క్రీజులో ఉంటే పవర్‌ప్లేలోనే 8090 పరుగులు చేయగలడని ఇషాన్ ప్రశంసించాడు. "అంతటి ప్రతిభ ఉన్న యంగ్ ప్లేయర్ తప్పుడు కారణాల వల్ల దారి తప్పకూడదని మేము కోరుకుంటున్నాం. అతను, నేను ఒకే ప్రాంతం నుంచి వచ్చాం. కాబట్టి ఒక అన్నయ్యగా అతడిని సంతోషంగా ఉంచడం, ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టేలా చేయడం మా బాధ్యత. మా కెరీర్ తొలినాళ్లలో మేము చేసిన పొరపాట్లను, ముఖ్యంగా మానసిక దృక్పథం, ఫిట్‌నెస్ విషయాల్లో చేసిన తప్పులను అతను పునరావృతం చేయకుండా చూసుకుంటాం. అతను తన క్రికెట్‌ను ఆస్వాదించాలన్నదే మా లక్ష్యం" అని ఇషాన్ కిషన్ స్పష్టం చేశాడు.



## కెనడాలో భారత కీర్తి పతాక.. వరల్డ్ జూనియర్ స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి ఇండియన్‌గా అనహత్

- వరల్డ్ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ గెలిచిన అనహత్ సింగ్
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డ్
- ఫైనల్‌లో ఈజిప్ట్ క్రీడాకారిణిపై వరుస గేముల్లో విజయం
- 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఈజిప్ట్ ఆధిపత్యానికి తెరదించిన అనహత్

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత యువ స్క్వాష్ సంచలనం అనహత్ సింగ్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డులకెక్కింది. కెనడాలోని నియాగరాఆన్‌దిలేక్‌లో శనివారం జరిగిన మహిళల ఫైనల్‌లో ఆమె ఈ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది.

టాప్ సీడ్, వరల్డ్ నంబర్ 20 అయిన అనహత్, ఫైనల్‌లో ఈజిప్టుకు చెందిన రెండో సీడ్ రుఖయ్యా సలేంను 113, 117, 119 తేడాతో వరుస గేముల్లో ఓడించింది. గత ఏడాది ఇదే టోర్నీలో కాంస్య పతకంతో సరిపెట్టుకున్న అనహత్, ఈసారి అద్భుత ప్రదర్శనతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో 15 ఏళ్లుగా ఈ టోర్నీలో కొనసాగుతున్న ఈజిప్టు క్రీడాకారుణుల ఆధిపత్యానికి అనహత్ తెరదించింది. 2010 తర్వాత ఈ టైటిల్ గెలిచిన తొలి నాన్‌ఈజిప్షియన్ ప్లేయర్‌గా కూడా ఆమె నిలిచింది.

శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో ఈజిప్టుకే చెందిన బార్బ్ సమీహ్‌ను ఓడించిన అనహత్, 21 ఏళ్ల తర్వాత ఈ టోర్నీ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయురాలిగా నిలిచింది. "ఫైనల్‌కు చేరడం నా తల్లిదండ్రులకు, కోచ్‌లకు చాలా ఆనందాన్నిచ్చింది. కానీ టోర్నమెంట్ ఇంకా ముగియలేదు" అని సెమీస్ అనంతరం ఆమె వ్యాఖ్యానించింది. చెప్పినట్టుగానే ఫైనల్లోనూ గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద టైటిల్‌ను సొంతం చేసుకుంది.



## హార్దిక్ పాండ్యా కోసం చెన్నై భారీ ఆఫర్.. ముంబై ఇండియన్స్ మెగా డిమాండ్

- ఐపీఎల్ 2027కు ముందు హార్దిక్‌ను దక్కించుకునేందుకు చెన్నై ప్రయత్నాలు
- ఆయుశ్ మాత్రే, శివమ్ దూబేలను డిమాండ్ చేస్తున్న ముంబై ఇండియన్స్
- మాత్రేను ఇచ్చేందుకు నిరాకరించి.. దూబే, బ్రెవిస్‌లను ఆఫర్ చేసిన చెన్నై
- దూబే, బ్రెవిస్‌తో పాటు రూ.10 కోట్లు నగదు ఇచ్చేందుకు సీఎస్‌కే ప్రతిపాదన
- చర్చలు విఫలమైతే రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్న కేకేఆర్

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్‌ను వీడనున్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మెగా ట్రేడింగ్ వ్యవహారంలో రెండు ఫ్రాంచైజీల మధ్య ఆసక్తికరమైన బేరసారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హార్దిక్‌ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ భారీ ప్యాకేజీని డిమాండ్ చేస్తుండగా, చెన్నై అందుకు భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది.

'హిందుస్థాన్ టైమ్స్' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు బదులుగా తమకు యువ సంచలనం ఆయుశ్ మాత్రేతో పాటు విధ్వంసకర ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఇవ్వాలని ముంబై ఇండియన్స్ కోరినట్లు సమాచారం. గత ఐపీఎల్ సీజన్‌లో దాదాపు 180 స్ట్రైక్ రేట్‌తో అదరగొట్టిన 19 ఏళ్ల మాత్రేను తమ జట్టు పునర్నిర్మాణంలో భాగంగా కీలక ఆటగాడిగా ముంబై భావిస్తోంది. అందుకే అతడిని ట్రేడింగ్‌లో చేర్చాలని పట్టుబడుతోంది.

అయితే, భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతాడని భావిస్తున్న ఆయుష్ మాత్రేను వదులుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఎంతమాత్రం సుముఖంగా లేదు. అతడిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ముంబైకి మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రతిపాదించింది. ఈ కౌంటర్ ఆఫర్‌లో భాగంగా శివమ్ దూబే, దక్షిణాఫ్రికా డైనమిక్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌లతో పాటు అదనంగా రూ.10 కోట్ల నగదును ముంబైకి ఇచ్చేందుకు సీఎస్‌కే సిద్ధమైనట్లు తెలుస్తోంది.



ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ముంబై ఇండియన్స్‌కు సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రయోజనం చేకూరవచ్చు. పేస్ బౌలింగ్ చేయగల భారత మిడిల్ ఆర్డర్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ చాలా అరుదైన ఆటగాడు. అయినప్పటికీ ఐపీఎల్ 2026లో అతను కేవలం 206 పరుగులు చేసి, 4 వికెట్లు మాత్రమే తీయడంతో అతని ఇటీవలి ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఒకవైపు తమ యువ ప్రతిభను కాపాడుకోవాలని చెన్నై, మరోవైపు అత్యధిక ప్రయోజనం పొందాలని ముంబై పట్టుబట్టడంతో ఈ ట్రేడింగ్ చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. ఈ రెండు జట్ల మధ్య ఒప్పందం కుదరకపోతే పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) వంటి ఇతర ఫ్రాంచైజీలు హార్దిక్‌ను దక్కించుకునేందుకు పోటీలో నిలిచే అవకాశం ఉంది.

## వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు రజతం.. స్నాచ్‌లో రిషికాంత రికార్డు

- కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్‌కు మరో పతకం
- వెయిట్‌లిఫ్టింగ్ 60 కేజీల విభాగంలో రిషికాంత సింగ్‌కు రజతం
- స్నాచ్ విభాగంలో సరికొత్త గేమ్స్ రికార్డు సృష్టించిన రిషికాంత
- మొత్తంగా 264 కేజీల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచిన వైనం
- మలేషియా లిఫ్టర్ స్వర్ణం కైవసం చేసుకున్నాడు

**అఖండ సూర్య :**

స్కాట్లాండ్ లోని గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ పతకాల ఖాతాలో మరో పతకం చేరింది. ఆదివారం జరిగిన పురుషుల 60 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో, భారత లిఫ్టర్ రిషికాంత సింగ్ చనమ్‌బామ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్నాచ్ విభాగంలో సరికొత్త గేమ్స్ రికార్డు సృష్టించినప్పటికీ, ఓవరాల్‌గా రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ పోటీల్లో నాలుగో రోజు భారత్‌కు ఇదే తొలి పతకం.



ఈ పోటీలో రిషికాంత స్నాచ్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తొలి ప్రయత్నంలో 116 కేజీలు, రెండో ప్రయత్నంలో 119 కేజీలు ఎత్తిన అతను, మూడో ప్రయత్నంలో ఏకంగా 121 కేజీల బరువును విజయవంతంగా ఎత్తాడు. ఈ లిఫ్ట్‌తో స్నాచ్ విభాగంలో సరికొత్త కామన్వెల్త్ గేమ్స్ రికార్డును తన పేరిట లిఖించుకుని అగ్రస్థానంలో నిలిచాడు.అయితే, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో పోటీ తీవ్రంగా మారింది. తొలి ప్రయత్నంలో 143 కేజీలు ఎత్తి పతక రేసులో ముందంజలో ఉన్న రిషికాంత, స్వర్ణం లక్ష్యంగా రెండో ప్రయత్నంలో 148 కేజీలు, మూడో ప్రయత్నంలో 151 కేజీలు ఎత్తడంలో విఫలమయ్యాడు. చివరి ప్రయత్నంలో బరువును భుజాల పైకి తెచ్చినప్పటికీ, జర్క్‌ను పూర్తి చేయలేకపోవడంతో మొత్తం 264 కేజీల బరువుతో తన ప్రస్థానాన్ని ముగించాడు.

ఇదే అదునుగా భావించిన మలేషియా లిఫ్టర్ బిన్ కస్దాన్ మహ్మద్ అనీక్, క్లీన్ అండ్ జర్క్‌లో అద్భుతంగా రాణించి మొత్తం 273 కేజీలతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇది కూడా ఓవరాల్‌గా కొత్త కామన్వెల్త్ గేమ్స్ రికార్డు కావడం విశేషం. కెన్యాకు చెందిన జాషువా అముంగా బోయా 260 కేజీలతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. స్వర్ణ పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నప్పటికీ, రిషికాంత తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు.

# కారు కొనుక్కోవడానికే సినిమాల్లోకి వచ్చా: రకుల్ ప్రీత్‌సింగ్

కారు కొనాలనే కోరికతో నటించిన తొలి సినిమానే తనని ఈ రోజు కెమెరా ముందు నిలబెట్టిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించడం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. "నేను కాలేజీలో చదువుతున్నప్పుడే అనుకోకుండా కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి నాకొక అవకాశం వచ్చింది. ఎవరో కొంతమంది నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పుడంతగా అవగాహన లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు నాకు రూ.5 లక్షల పారితోషికం ఇస్తామన్నారు. వాటితో కారు కొనుక్కోవాలి.. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ సినిమా చేయడానికి అంగీకరించాను.40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. అప్పుడే గ్రహించా కెమెరా ముందు ఉండడం నాకు ఎంతగానో ఇష్టమని. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తర్వాత నటనలోకి రావాలని నిర్ణయించుకున్నా. అందుకే కొంత విరామం తీసుకుని 2013లో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. ఎవరి ప్రమేయం లేకుండానే ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. ప్రారంభంలో చదువు కారణంగా కొన్ని పెద్ద సినిమాల్ని వదులుకోవల్సి వచ్చింది"అని అంది రకుల్. 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో వెండితెరకు పరిచయమైన ఆమె తిరిగి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'(2013)తో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఇప్పుడామె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న హిందీ చిత్రం 'రామాయణ'లో శూర్పణఖగా కనిపించనుంది.



# 'చిట్టి బాబు'గా వెంకటేశ్

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న *'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 ఏకే 47'* చిత్రం నుంచి కీలక అప్‌డేట్ విడుదలైంది. ఈ సినిమాలో వెంకటేశ్ పోషిస్తున్న పాత్ర పేరు *'చిట్టి బాబు'* అని చిత్ర బృందం ప్రకటించింది. నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. రేపటి నుంచి సినిమాలోని ఒక్కో పాత్రను పరిచయం చేయనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా హీరోయిన్ శ్రీనిధి శెట్టిని *'స్వర్ణ', యువీన పార్థవిని *'సంపూర్ణ'*, రాజా ప్రజ్వల్‌ను 'సర్వ' పాత్రల్లో పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఇటీవల నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కూడా ఈ చిత్రంలో నటిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్‌లో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గతంలో *'వెంకీ77'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రంపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వెంకటేశ్ నటించిన *'సంక్రాంతికి వస్తున్నాం'* విజయవంతం కావడం, త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన పూర్తిస్థాయి హీరోగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఆసక్తి మరింత పెరిగింది.



# రజనీకాంత్ జీవిత కథ వెండితెరకు?



సూపర్ స్టార్ రజనీకాంత్ జీవిత కథ త్వరలో బయోపిక్‌గా తెరకెక్కే అవకాశాలు ఉన్నాయనే వార్తలు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. బెంగుళూరులో బస్ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి భారతీయ సినీ పరిశ్రమలో అగ్రనటుడిగా ఎదిగిన రజనీకాంత్ జీవితం ఇప్పటికే కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచింది. తాజా కథనాల ప్రకారం, రజనీకాంత్ తన ఆత్మకథను సినిమాగా రూపొందించే అంశంపై సన్నిహితులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ ఆత్మకథలో ఆయన జీవితంలోని కీలక ఘట్టాలు, సినీ ప్రయాణం, విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, వ్యక్తిగత అనుభవాలను పొందుపరుస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని బయోపిక్‌గా తెరకెక్కించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. గతంలో రజనీకాంత్ కుమార్తె సౌందర్య కూడా ఆయన ఆత్మకథ రాస్తున్న విషయాన్ని ధ్రువీకరించారు. బెంగుళూరులో బస్ కండక్టర్‌గా ప్రారంభమైన ప్రయాణం నుంచి కోలీవుడ్ సూపర్ స్టార్‌గా ఎదిగిన జీవిత విశేషాలను ఈ పుస్తకంలో పొందుపరుస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రస్థానంలో రజనీకాంత్ తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాలను ప్రదానం చేసింది. ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో *'జైలర్ 2', అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో *'ధర్మాన్'* చిత్రాల్లో రజనీకాంత్ నటిస్తున్నారు. *'జైలర్ 2'** అక్టోబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

# యశ్ 'టాక్సిక్' కొత్త పోస్టర్ విడుదల




కేజీఎఫ్ సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు పొందిన యశ్ హీరోగా నటిస్తున్న *'టాక్సిక్'** చిత్రం విడుదలకు నెల రోజుల సమయం ఉండగా, చిత్ర బృందం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. యశ్ ఇంటెన్స్ లుక్‌తో విడుదలైన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొత్త పోస్టర్‌లో యశ్ రక్తంతో తడిసిన చేతులతో ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ కనిపిస్తున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుండగా, కథపై ఎలాంటి వివరాలు వెల్లడించకుండా ఆసక్తిని పెంచుతోంది. *"అతని చేతులకు రక్తం అంటింది"* అనే క్యాప్షన్‌తో మేకర్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. *'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'* అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె కథను కూడా రచించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో

# సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు పెరగాలి: మాళవిక మోహనన్



వెండితెరపై మహిళా పాత్రల్లో నిజమైన మార్పు రావాలంటే కేవలం నటీమణులు మారితే సరిపోదని, సినీ పరిశ్రమలోని ఇతర విభాగాల్లో మహిళల సంఖ్య పెరగాలని నటి మాళవిక మోహనన్ అన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'కిల్ బిల్' తరహాలో నటించాలన్న తన కలను ఆమె తాజాగా బయటపెట్టారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. కమర్షియల్ సినిమాల్లో మహిళలకు విభిన్నమైన పాత్రలు రాకపోవడానికి ప్రధాన కారణాన్ని పేర్కొన్నారు.

''వాస్తవానికి సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు, రచయిత్రులు చాలా తక్కువ. వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. సినిమాల్లో ఫిమేల్ గేజ్ మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మహిళా మేకర్స్ పెరిగినప్పుడే, అద్భుతమైన యాక్షన్ పాత్రలు పుట్టుకొస్తాయి. అప్పుడు మన దేశంలోనూ 'కిల్ బిల్'లాంటి సినిమాలు వస్తాయి. మహిళల కోణంలో సాగే కథలకు కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' (Laapataa Ladies) ఓ చక్కటి ఉదాహరణ. ఆ సినిమాతో పాటు, అందులోని మహిళా పాత్రలను తీర్చిదిద్దిన విధానం నన్ను బాగా ఆకట్టుకుంది. మహిళా దర్శకురాలి కోణంలో ఆ పాత్రలను చూడడం ఎంతో సంతోషంగా ఉంది'' అని ఆమె పేర్కొన్నారు.

ప్రస్తుతం, మాళవిక మోహనన్ ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. హీరో కార్తీ సరసన 'సర్దార్ 2'లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నావెల్' అనే సినిమాలోనూ ఆమె సందడి చేయనున్నారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com